క్లుప్తంగా

లక్ష్మీదేవిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విశ్వ



బండారు లక్ష్మీదేవిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మండల పరిధిలోని మరుట్లకు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు, నారాయణ,బండారు లక్ష్మీదేవిలు ఆరోగ్య సమస్యలతో అనంతపురం లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు సీపీ వీరన్న, బెస్త రమణ, బండారు శ్రీని వాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఈశ్వరమ్మ అమ్మవారి గ్రామోత్సవం



అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న మాలధారులు

ఉరవకొండ: స్థానిక బళ్లారి బైపాస్ వద్ద వెలసిన ఈశ్వరమ్మ ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి మాలధారణ చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టణంలో ఊరేగించారు.

కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా రాంభూపాల్‌రెడ్డి

కళ్యాణదుర్గం: నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా కంబదూరు మండలం వెంకటంపల్లి గ్రామానికి చెందిన రాంభూపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి నియామక ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు.

గ్రామ దేవత విగ్రహ ప్రతిష్టకు విరాళం



కైరేవు గ్రామ దేవత విగ్రహ ప్రతిష్టకు ఆహ్వానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: శెట్టూరు మండలం కైరేవులోని మారెమ్మ దేవి విగ్రహ ప్రతిష్టకు రావాలని వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడుకు గ్రామస్తులు శుక్రవారం ఆహ్వానించారు. ఈసందర్భంగా ఉమా స్వగ్రహంలో ఆలయానికి రూ.30వేలు విరాళం అందించారు. ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఉమా గ్రామస్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో గొర్ల గంగాధర్, బోయ రామాంజి, హనుమంతరాయుడు, మనోహర, పాముల శ్రీరాములు, ఈడిగ గంగాధర, గొర్ల యల్లప్ప పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న సీఎం చంద్రబాబు

కూడేరు: సీఎం చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచుతూ, స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టడం దారుణమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. డీటీ సూర్యప్రతాప్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కరీం సాబ్, నాయకులు వెంకటేష్ , మల్లికార్జున పాల్గొన్నారు.

‘చెత్త’శుద్ధి లేదు..సంపద సృష్టి లేదు

- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణకు గ్రహణం
- కేంద్రాలన్నీ నిరుపయోగమే
- గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు
- కూటమి ప్రభుత్వానికి ఆచరణలేదు



ఉరవకొండలో నిరుపయోగంగా పడి ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రంలోని క్రషింగ్ మిషన్లు



ఉరవకొండలో చెత్త దిబ్బల మధ్య నిరుపయోగంగా కనిపిస్తున్న సంపద తయారీ కేంద్రం

ఉరవకొండ/వజ్రకరూరు :కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలక గ్రహణం పట్టింది. పంచాయతీల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకు పోయింది. చెత్త సేకరణ లేదు.. సంపద తయారీ లేదు అని ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామ పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు 80శాతానికి పైగా నిరుపయోగంగా మారాయి.వీటి నిర్వహణకు వెచ్చించిన రూ.లక్షల నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారింది. వీటిని వినియోగంలోకి తెచ్చి సంపద సృష్టిస్తే ఆదాయ వనరుగా మారుతాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆదిశగా ప్రయత్నించలేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పంచాయతీల పరిపుష్టి చెందాలన్న లక్ష్యమేదీ?

చెత్త నుంచి సంపద తయారీకి తొలుత తడి పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేయాలి. తదుపరి పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌ల ద్వారా చెత్త నుంచి సంపద కేంద్రానికి తరలించాలి. పొడి చెత్తగా పిలవబడే ప్లాస్టిక్‌ను విక్రయించడం ద్వారా లాభం ఆర్జించాలి. అయితే ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు



కమలపాడులో నిరుపయోగంగా కన్పిస్తున్న చెత్త సంపద కేంద్రం

మండల కేంద్రాలకు తడి చెత్తను ఉపయోగించి ఎరువును తయారు చేసే రబ్బరు వస్తువులను మెషీన్ ద్వారా ఆడించి, ముక్కలుగా మార్చి యంత్రం ద్వారా దహనం చేయాలి. ఇందుకోసం ప్రతి కేంద్రం వద్ద రెండు యంత్రాలను అందుబాటులో ఉంచాలి. అయితే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అవసరం కావడంతో వాటిని వినియోగించలేదు.

వేతనాలు లేక గ్రీన్ అంబాసిడర్లు అవస్థలు..

సంపద కేంద్రాలను నిర్మించిన ఆరంభంలో గ్రామాల్లో ఇంటి వద్దనే తడిపొడి చెత్తను వేరు చేసేలా డస్ట్ బిన్లను కూడా ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. ఈ డస్ట్‌బిన్లను గ్రీన్ అంబాసిడర్లు ఇంటికి వచ్చి తీసుకెళ్లి కేంద్రానికి చేర్చాలి. కానీ గ్రీన్ అంబాసిడర్లకు నెలసరి వేతనం కేవలం రూ.6వేలు కావడం ఆ వేతనాలు కూడా ఆరు నెలలకు లేక ఏడాదికి ఇస్తుండటంతో ఏ ఒక్కరూ పని చేయడంలేదు. వ్యవసాయ, దినసరి కూలి పనులకు వెళ్తే రోజుకు రూ.500కు పైగా వస్తుండడంతో అటు వైపు మొగ్గు చూపుతున్నారు. పలు కేంద్రాల్లో తొట్టెలు నిర్మించి సేంద్రీయ ఎరువులైన వాన పాముల ఎరువును తయారు చేశారు. తయారీకి కూలీల ఖర్చు గణనీయంగా పెరగడం, వానపాముల ఎరువు సకాలంలో అమ్ముడుకాకపోవడంతో నష్టదాయకంగా మారింది. దీంతో అన్ని కేంద్రాల్లోను ఎరువుల తయారీని నిలిపివేశారు. ప్రస్తుతం తొట్టెలన్నీ కేంద్రాల్లోనూ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

సంపద సృష్టి లేకుండానే కొత్తవి మంజూరుకు ప్రకటన..

ఇప్పటికే ఉన్న చెత్తతో సంపద కేంద్రాల్లో ఎలాంటి సంపద సృష్టి లేక నిరుపయోగంగా వదిలేసి ఉన్నారు. వాటి నిర్మాణానికి వెచ్చించిన కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. వీటి పరిస్థితి ఇలా ఉంటే కొత్త కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా మారింది. ఉన్నవాటిని వినియోగించి సంపద సృష్టించాకే కొత్తవి నిర్మిస్తే బాగుంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

ఉరవకొండ నియోజకవర్గ పరిధిలో...	
గ్రామ పంచాయతీలు	84
నిర్మించిన సంపద కేంద్రాలు	69
నిర్మాణంలో ఉన్నవి	15
నిరుపయోగంగా ఉన్నవి	39
పూర్తయిన పెద్ద కేంద్రాలు	31
పూర్తయిన చిన్న కేంద్రాలు	11
పెద్ద కేంద్రం నిర్మాణ వ్యయం	రూ.5.60 లక్షలు
చిన్న కేంద్రం నిర్మాణ వ్యయం	రూ.2.25 లక్షలు

కొత్త వాటికి నిధులు ఇస్తామన్నారు..



మండలంలో ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చి సంపద సృష్టి చేపడుతాం. కొత్త కేంద్రాల మంజూరుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తామని ప్రకటించింది. వీటికి కుడా ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఇది సాకారమైతే పంచాయతీలకు మరింత ఆదాయం వచ్చి అభివృద్ధి చెందుతాయి.

– రవిప్రసాద్, ఎంపీడీఓ, ఉరవకొండ

సంక్రాంతిలోపు పూర్తి చేస్తాం



సంక్రాంతి పండుగ లోపు నిర్మాణంలో ఉన్న సంపద సృష్టి కేంద్రాలను పూర్తి చేసి వాటిని వినియోగంలో తీసుకొస్తాం. ముఖ్యంగా కేంద్రాల్లో ఎరువుల తయారీకి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వానపాముల తయారీని చేపడతాం.

– దామోదర్‌రెడ్డి, ఈఓఆర్‌డీ, వజ్రకరూరు

ఆక్రమించిన భూమిలో హెచ్చరిక బోర్డు



శివరామిరెడ్డి కాలనీలో ఆక్రమణకు గురైన స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఉరవకొండ: ఈనెల 11న ‘సాక్షి’లో ‘తమ్ముళ్ల బరితెగింపు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి రెవెన్యూ అధికారులు స్పందించి, విచారణ చేశారు. శుక్రవారం టీడీపీ నేతలు శివరామిరెడ్డి కాలనీలోని ప్రభుత్వ భూమిసర్వే నం. 556-1డీ లోని 40 సెంట్ల స్థలంలో కంచె ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించుకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పిచ్చిమొక్కల తొలగింపు



పీహెచ్‌సీ వద్ద పిచ్చి మొక్కలు తొలగించిన దృశ్యం

కూడేరు: స్థానిక పీహెచ్‌సీలో పిచ్చిమొక్కలను శుక్రవారం తొలగించారు. ఇటీవల ‘సాక్షి’లో పీహెచ్‌సీలో ‘పాములతో భయం ..భయం’ శీర్షికన వార్త ప్రచురితమైంది. వైద్యాధికారులు స్పందించారు.

గ్రామాభివృద్ధికి కలసికట్టుగా కృషి చేయాలి

వజ్రకరూరు: గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని డీఎల్‌డీఓ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం వెంకటాంపల్లిపెద్ద తండా (రూపానాయక్ తండా)గ్రామంలోని స్థానిక ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో ధర్తిఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ – గిరిజన సాధికారత, వికసిత్‌భారత్ పథకంలో భాగంగా గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు జరిపారు. డీఎల్‌డీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి విషయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో ప్రణాళిక తయారు చేసుకొని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ రవి ప్రసాద్ మాట్లాడారు. ధర్తి ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద వెంకటాంపల్లిపెద్ద తండా, వెంకటాంపల్లిచిన్నతండా గ్రామాలు ఎంపికయినట్లు తెలిపారు. కార్యక్రమంలో బంజారా సంఘం



వెంకటాంపల్లిపెద్దతాండాలో బిర్సా ముండా జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయ ఉపాధ్యక్షుడు కేశవనాయక్, స్థానిక సర్పంచు శివాజీ నాయక్, మాజీ జెడ్పీటీసీ తులసీదాస్‌నాయక్, బంజారా సంఘం నాయకులు సుబ్రమణ్యంనాయక్, వాల్యానాయక్, డాక్యానాయక్, గోపాల్‌నాయక్, ఎర్రిస్వామినాయక్, సామానాయక్, మాజీ సర్పంచు రామక్కబాయి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గౌరమ్మ జాతర

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో శ్రీగౌరి దేవి అమ్మవారి జాతర శనివారం నుంచి ప్రారంభమవుతుందని గ్రామస్తులు ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా కార్తీక పౌర్ణమి రోజున జాతర జరగనున్నట్లు తెలిపారు. 16న ఉదయం పూజలు, 17న గౌరీదేవి అమ్మవారి ఆగమనం, 18న ఉదయం భక్తులకు దర్శనం, అన్నసంతర్పణ, 19న తెల్లవారుజాము నుంచి గ్రామోత్సవం, అనంతరం మధ్యాహ్నం జలధి ఉంటుందని, మంగళవారం రాత్రి హారతితో జాతర ఉంటుందని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

కళ్యాణద్గుం రూరల్: విట్లంపల్లి గ్రామానికి చెందిన వివాహిత ఇందు అదృశ్యమైందని రూరల్ సీఐ వంశీ కృష్ణ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిస్తే సెల్: 9346917127, 8217795791 నంబర్లలో సమాచారం ఇవ్వాలని రూరల్ సీఐ వంశీ కృష్ణ తెలిపారు.

దాడి చేశారని లైన్‌మెన్ ఫిర్యాదు

బొమ్మనహాళ్ బెళుగుప్ప: మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన విద్యుత్‌శాఖ లైన్‌మెన్ ఎల్లారెడ్డి తనపై గ్రామానికి చెందిన ధనుంజయ దాడి చేశాడని పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. గ్రామంలో విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ బకాయి చెల్లించాలని ధనుంజయను అడగ్గా, చొక్కాపట్టుకుని దాడి చేశాడన్నాడు. గ్రామస్తుల ముందే దాడి చేశాడని పోలీసులకు లైన్‌మెన్ ఫిర్యాదు చేశాడు.

కుప్పకూలిన ఇల్లు

కంబదూరు: మండలంలోని ఓబగానిపల్లి గ్రామానికి చెందిన ఈడిగ శ్యామన్నకు చెందిన ఇల్లు గురువారం అర్ధరాత్రి కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఉన్న ఇళ్లు కూలిపోవడంతో ప్రస్తుతం గూడును కోల్పోయమని బాధితులు తెలిపారు.

బీసీ హాస్టల్ తనిఖీ

విడపనకల్లు: మండల కేంద్రంలో ఉన్న బీసీ బాలికల హాస్టల్‌ను ఈఓఆర్డీ సత్యబాబు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో దోమలు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని హాస్టల్ వార్డెన్ కాంతమ్మకు సూచించారు. అనంతరం భోజనం పరిశీలించారు. నాణ్యమైన భోజన వసతి కల్పించాలని వార్డెన్‌కు సూచించారు.

పేదలకు ఇంటి స్థలం ఇవ్వాలి

గుమ్మఘట్ట: ఇళ్లులేని నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని తాళ్లకెర గ్రామంలో ఇళ్లులేని వారి వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాధమ్మ, దేవరాజు, బద్రి, బుట్టలింగ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించండి

కణేకల్లు: కణేకల్లు కేజీబీవీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ అధికారులను కోరారు. స్థానిక తహసీల్దార్ ఫణికుమార్‌ను కలిసి కేజీబీవీ సమస్యలను వివరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

కుక్కలకు రేబిస్ టీకా

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక పశువైద్యశాలలో మున్సిపాలిటీలోని సుమారుగా 58 వీధి కుక్కలకు పశువైద్యులు నాగలింగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రేబీస్ టీకా వేశారు. అనంతరం కుక్కలను పట్టణంలోని వదిలివేశారు. డాక్టర్ నాగలింగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కుక్కలకు రేబీస్ టీకా వేసిన తర్వాత కుక్కలు మనుషులను గాయపరిచినా ప్రమాదం ఉండదన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ అధికారులు పాల్గొన్నారు.

18న చలో విజయవాడ మహాధర్నా

రాయదుర్గంటౌన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ ఈనెల 18న చేపట్టిన ‘హలో విద్యార్థి–చలో విజయవాడ మహాధర్నా’ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో విద్యా ర్థినులతో కలిసి చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హారిక, మేఘన, రజిని, కావ్య, వలి, గౌతమ్, అరవింద్ పాల్గొన్నారు.

18న మహాధర్నాను విజయవంతం చేయండి

ఉరవకొండ: పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద మహాధర్నా చేపట్టినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధార్థ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్ఎఫ్ఐ మహాధర్నా పోస్టర్లను విద్యార్థి సంఘం నేతలు విడుదల చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు నందు, హిరణ్య పాల్గొన్నారు.

తల్లిదండ్రులకూ బాధ్యత ఉండాలి

రాయదుర్గంటౌన్: విద్యార్థుల చదువు పట్ల ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత ఉండాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి. విజయభాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. సమావేశంలో సీనియర్ అధ్యాపకులు జ్ఞానేశ్వర్, లైబ్రేరియన్ వెంకటేష్‌నాయక్, అధ్యాపకులు మురళీకృష్ణ, కోట రమేష్, జైరాజ్, శ్రీరాములు హాజరయ్యారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంచుకోండి

కణేకల్లు: పుస్తకాల పఠనంతో విజ్ఞానాన్ని పెంచుకోవాలని కణేకల్లు గ్రంథాలయాధికారి వన్నూరు

సంక్షిప్త సమాచారం

స్వామి పేర్కొన్నారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కణేకల్లులోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన జరిగింది. మార్కెట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పుస్తక ప్రదర్శనను సందర్శించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్: సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి కోరారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో డివిజన్‌లోని వీఆర్ఏలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలోని ఆర్డీఓ వసంత్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. అంజి మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పాదయాత్ర సమయంలో నారా లోకేష్ అధికారంలోకి రాగానే వీఆర్ఏల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

కంబదూరు: స్థానిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.300 చెల్లించి సభ్యత్వం కలిగి ఉన్న రైతులు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని తహసీల్దార్ బాలకిషన్ సూచించారు. ఈకేవైసీ చేయించుకోవాల్సిన రైతులు పట్టదారు పాసు పుస్తకం,బ్యాంక్ పాసు బుక్,ఆధార్,రేషన్ కార్డుల జిరాక్స్‌తో పాటు రెండు పాసు ఫొటోలను తీసుకొని సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులకు ఇవ్వాలని తెలియజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రాయదుర్గంటౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని యూపీఎస్ సీఐ జయనాయక్ తెలిపారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో సిబ్బందితో కలిసి వాహనాల ఆకస్మిక తనిఖీ చేశారు.

ప్రారంభమైన గజగౌరీ దేవి ఉత్సవాలు

బొమ్మనహాళ్: మండలంలో గజగౌరీ దేవి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసం సందర్భంగా గజగౌరీ దేవి ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించారు. గజగౌరీ దేవి విగ్రహాలను ఆలయాల్లో ప్రతిష్టించారు. ఉంతకల్లు, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, కృష్ణాపురం, శ్రీధరఘట్ట, నేమకల్లు, దేవగిరి తదితర గ్రామాల్లో గజగౌరీదేవి విగ్రహాలను శివాలయాల్లో ప్రతిష్టించారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10: 30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయి స్వామి శుక్రవారం తెలిపారు.

చిక్కణ్ణేశ్వరుడికి నాగాభారణం బహూకరణ

కణేకల్లు: ఆరాధ్యదైవమైన చిక్కణ్ణేశ్వరుడికి రిటైర్డ్ హెచ్ఎం టీ.శేషారెడ్డి రెండు కిలోల వెండి నాగాభారణం బహూకరించారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి స్వామికి ప్రత్యేక పూజలు చేయించి, నాగాభారణాన్ని అందించారు. తన మనవుడి పుట్టినరోజు సందర్భంగా స్వామికి వెండి నాగాభారణం చేయించినట్లు తెలిపారు.

పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత

కూడేరు: పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత ఏర్పడుతుందని..రక్తం తక్కువగా ఉంటే ప్రసవ సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తుందని ఇన్‌చార్జ్ మండల వైద్యాధికారి సురేంద్ర రెడ్డి గర్భిణులకు సూచించారు. శుక్రవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో గర్భిణులకు వైద్య శిబిరం నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్ గర్భిణులకు హిమోగ్లోబిన్, షుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రామేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం

వజ్రకరూరు: స్థానిక రామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని రుద్ర హోమం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం, రుద్రజపం, మృత్యుంజయ జపం, పంచామృత అభిషేకం, జ్వాలాతోరణం, మహా మంగళ హారతి, లక్షదీ పోత్సవం నిర్వహించారు. జరుట్లరామలింగేశ్వరస్వామికి కార్తీకపూజలు చేశారు.

78.40 శాతం ఇళ్ల జియో ట్యాగింగ్ పూర్తి

రాయదుర్గంటౌన్: మున్సిపాలిటీలో శుక్రవారం సాయంత్రం నాటికి 78.40 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయినట్లు డెలిగేషన్ కమిషనర్, మున్సిపల్ డీఈ రవిప్రకాష్‌నాయుడు తెలిపారు. 32 వార్డుల్లో మొత్తం 18,984 కుటుంబాలు ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం నాటికి 14,650 ఇళ్ల మ్యాపింగ్ పూర్తి చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విడపనకల్లు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, ఈఓఆర్డీ సత్యబాబు, ఆరోగ్య శాఖాధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. కడ్లే గౌరమ్మ ఉత్సవాల నేపథ్యంలో అధికారులు ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు.పంచాయతీ కార్యదర్శి బాష, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన

ఉరవకొండ: ఉరవకొండ గ్రంథాలయ శాఖ కార్యాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం పుస్తక ప్రదర్శన శుక్రవారం ఏర్పాటు చేశారు. గ్రంథాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలో 200 మంది విద్యార్థులు పాల్గొని వారికి నచ్చిన పుస్తకాలను చదివారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

బ్రహ్మసముద్రం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నందకిశోర్ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రణాళికలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఈఓఆర్డీ రంగనాయకులు , పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకపౌర్ణమి పూజలు



మార్కండేయస్వామి ఆలయంలో దీపారాధనలో మహిళలు



ప్రత్యేక అలంకరణలో బెళుగుప్ప రామేశ్వరస్వామి



నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో గౌరమ్మ ప్రతిష్టాపన



దీపాలను వెలిగిస్తున్న మహిళలు

రాయదుర్గంటౌన్/కంబదూరు:/బెళుగుప్ప/శెట్టూరు/బొమ్మనహాళ్/కూడేరు/కణేకలు/: రాయదుర్గంలోని శివాలయాలతోపాటు ప్రముఖ ఆలయాల్లో కార్తీకమాస పూజలు శుక్రవారం నిర్వహించారు. మార్కండేయస్వామి,నీలకంఠేశ్వర స్వామి, చన్నవీరస్వామి, బసవేశ్వరస్వామి, వీరభద్ర స్వామి, చంద్రమౌళేశ్వరస్వామి, బసవేశ్వరస్వామి, రేవణసిద్దేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక దీపారాధన చేశారు. కోటలో వెలసిన నగరేశ్వర స్వామి ఆలయంలో జ్వాలాతోరణాన్ని నిర్వహించారు.

కంబదూరు మండల కేంద్రంలోనిమల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు.

శెట్టూరు మండలంలోని శివాలయాలలో కార్తీక దీపారాధన చేశారు. శెట్టూరులో పురాతన చంద్రమౌళేశ్వర స్వామి, కనుకూరు రామింగేశ్వరస్వామిస్వామి, ములకలేడు, తిప్పనపల్లి, యాటకల్లు శివాలయాల్లో పూజలు నిర్వహించారు. రాత్రికి దీపారాధన చేశారు.

కూడేరు: కూడేరులోని శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం లక్ష దీపోత్సవం నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, ధ్వజ స్తంభం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు.

గౌరీదేవికి ప్రత్యేక పూజలు

బెళుగుప్ప మండల కేంద్రంలోని రామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం గౌరీదేవికి వ్రత పూజలను నిర్వహించారు. శ్రీరామేశ్వరాలయంలో జ్వాలాతోరణ దర్శన పూజలు నిర్వహించారు.

బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో వెలసిన శ్రీ ఆంజినేయస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని లక్షదీపోత్సవం నిర్వహించారు. ధ్వజ స్తంభం వద్ద దీపారాధాన చేశారు.

కణేకల్లు కణేకల్లులోని షిర్డీసాయిబాబా ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, సతీమణి ఆలేరి విజయలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మారెంపల్లిమారెన్న,గోవర్ధన్ పాల్గొన్నారు.



కూడేరు: జోడు లింగాల ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పెన్నోబిలంలో వైభవంగా జ్వాలాదీపం

ఉరవకొండ కార్తీక పౌర్ణమిను పురస్కరించుకొని పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం జ్వాలాదీపాన్ని వెలిగించారు. మల్లేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవాన్ని నిర్వహించారు. గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి చేతుల మీదుగా జ్వాలా దీపాన్ని వెలిగించారు.



మల్లేశ్వరస్వామి క్షేత్రంలో కార్తీక దీపాలు వెలిగించిన దృశ్యం



బెళుగుప్ప రామేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు జ్వాలాతోరణ దర్శన భాగ్యం కల్పిస్తున్న దృశ్యం